గింజ కొంటే ఒట్టు

అలంకార ప్రాయంగా కొనుగోలు కేంద్రాలు

- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- మిల్లర్లతో కుమ్మక్కై ధరలు తగ్గించి దోచుకుంటున్న దళారులు
- నష్టపోతున్న అన్నదాతలు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కొనుగోలు కేంద్రాల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వహించే ఉద్యోగులను నియమించకపోవడం..ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం..రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడం..కఠిన నిబంధనలు, తదితర కారణాలతో కొనుగోళ్ల లక్ష్యం నీరుగారుతోంది. ఒకటిరెండు చోట్ల మినహా కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా గింజ కొంటున్న పరిస్థితులు లేవు. ఫలితంగా రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు మిల్లర్లతో కుమ్మక్కై ధరలు తగ్గించి దోచుకుంటున్నారు. గురువారం కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని కొనుగోలు కేంద్రాలను 'సాక్షి' పరిశీలించగా అన్నదాతల పాట్లు వెలుగుచూశాయి.



ఈ ఫొటోలో పాడి పశువులకు ఎండుగడ్డి తీసుకెళ్తున్న రైతు పేరు మాగంటి కోటయ్య. కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామం. రబీ సీజన్‌లో రెండెకరాల్లో వరి ఫైరు సాగు చేస్తే 60 బస్తాలు దిగుబడి వచ్చింది. దళారీకి ధాన్యాన్ని అమ్మాడు.దళారీపై నమ్మకంతో కనీసం ధాన్యం ధర ఎంత అని కూడా అడగకుండానే ఇచ్చేశాడు. గ్రామంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం కూడా తెలియదని చెబుతున్నాడు.



కావలి: కొత్తపల్లి వద్ద ధాన్యాన్ని సేకరిస్తున్న దళారులు

కావలి: కావలి నియోజకవర్గంలో 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వహించే ఉద్యోగులను నియమించకపోవడం.. క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడం.. తదితర కారణాలతో కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా గింజ కొంటున్న పరిస్థితులు కనిపించడం లేదు. రైతులు దళారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి.

ధాన్యం ధరల గురించి తెలియదు



నేను డిసెంబర్ 3వ తేదీ బదిలీపై చలంచర్ల గ్రామ సచివాలయానికి వచ్చాను. అప్పట్నుంచి గ్రామ సచివాలయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ లేరు. చలంచర్ల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం, ధరలు గురించి నాకు తెలియదు. నాలుగు రోజుల క్రితం ఒక రైతు ధాన్యం అమ్మాలని ఫోన్ చేయగా పక్క గ్రామమైన సిరిపురం గ్రామ సచివాలయంలో సంప్రదించాలని సూచించాను.

–బీ రేణుకారెడ్డి, విలేజ్ హార్టీకల్చరల్ అసిస్టెంట్, చలంచర్ల రైతుసేవా కేంద్రం

సాక్షి విజిట్

దళారీకే ఇచ్చా



మా గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. ధాన్యం ధరలు ఎలా ఉన్నాయో చెప్పేవారు కూడా లేరు. ధాన్యాన్ని ఎండబెట్టి నిల్వ చేసుకునే వసతి లేక దళారీకి పుట్టి రూ.18వేల చొప్పున ఇచ్చా.

–మేకల శీనయ్య, రైతు, చలంచర్ల

ధరలు తగ్గిపోవడం బాధగా ఉంది



ఈ ఏడాది దిగుబడులు తక్కువగా ఉన్నా ధరలు తగ్గించేశారు. గతేడాది షుగర్‌లెస్ పుట్టి రూ.23,500కు కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.19,500కు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో బియ్యాన్ని మాత్రం అధిక ధరలకు అమ్ముతున్నారు. ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మాలంటే మనస్సుకు కష్టంగా ఉండడంతో కోతకు వచ్చినా పంట కోయలేదు.

–కొమరా శ్రీనివాసులు, రైతు, చలంచర్ల

కేంద్రాన్ని తెరవలేదు



మా ఊరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెరవలేదు. కొంత పంట కోసి దళారీకి పుట్టి రూ.18,200కు విక్రయించా. ధాన్యం ధరలు తక్కువగా ఉండడంతో మిగిలిన పంటను కోయలేదు. ధరలు పెరుగుతాయనే ఆశతో వారం చూసి కోద్దామనుకుంటున్నా.

–తల్లిబోయిన వెంకట శేషయ్య, రైతు, చలంచర్ల గ్రామం

సాకులతో తప్పించుకుంటున్నారు



కొండాపురం: సాయిపేటలో తాళం వేసిన రైతుసేవా కేంద్రం



చాకలికొండలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ధ్యానం ఆరబోసుకుంటున్న రైతులు

ఉదయగిరి/కొండాపురం/ జలదంకి: ఉదయగిరి నియోజకవర్గంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జలదంకి మండలంలో మినహా ఎక్కడా ధాన్యాన్ని సేకరించడం లేదు. నియోజకవర్గం వ్యాప్తంగా 60 వేల ఎకరాల్లో వరి సాగుచేసినట్లుగా ఈక్రాప్ నమోదు చేశారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.కొన్ని మండలాల్లో 25 నుంచి 50 శాతం వరకు నూర్పిళ్లు చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని అడుగుతున్నా అధికారులు రకరకాల సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా పుట్టికి రూ.2 వేల వరకు తగ్గించి దళారులు దోచుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన పెట్టుబడి ఖర్చులు, తగ్గిన దిగుబడులు, మద్దతు ధర లభించని కారణంగా రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆర్భాటంగా చెబుతున్నా నాలుగైదు కేంద్రాలను మినహాయిస్తే ఎక్కడా ఇంతవరకు గోనె సంచులు గానీ, కొనుగోలు సామగ్రిని గానీ అందజేయలేదు. జలదంకిలోని రెండు కేంద్రాలకు మాత్రమే జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ఉన్న చోట మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీన్నిబట్టి కొనుగోలు కేంద్రాల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. జలదంకి మండలం చిన్నక్రాకలో కొనుగోలు కేంద్రం ఉన్నా అక్కడి రైతుల ధాన్యాన్ని జలదంకి కేంద్రం నుంచి ఒక్క లారీ మాత్రమే గురువారం తరలించారు. ఆ ధాన్యం కూడా ప్రైవేట్ దళారులు కొనుగోలు చేసి రైతులతో ఒప్పందం మేరకు జలదంకి కేంద్రం నుంచి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి మండలాల్లో కొనుగోలు కేంద్రాల తలుపులు కూడా తీయలేదు. ఉదయగిరి మండలంలోని గుడినరవ కేంద్రంలో కొనుగోలు సామగ్రి ఉన్న ధాన్యం విక్రయించేందుకు రైతులు ముందుకు రావడం లేదని, మార్చి చివరిలోపు కోతలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వింజమూరు మండలం చాకలకొండ కొనుగోలు కేంద్రానికి ఇంతవరకు గోనె సంచులు, కాటా సామగ్రి రాలేదు. కొందరు రైతులు ధ్యానం విక్రయించేందుకు ముందుకువచ్చిన లారీకి సరిపడా సరుకు ఉంటేనే తీసుకుంటామని, కూలీలు, లారీని మీరే ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తోంది.అధికారులను అడిగితే సింపుల్‌గా మా ధరలకు, ప్రైవేట్ కొనుగోలుదారుల ధరలకు వ్యత్యాసం లేనందున రైతులు మాకు విక్రయించడం లేదని చెప్పి తప్పించుకుంటున్నారు. కానీ వాస్తవంగా ప్రైవేట్ వ్యక్తులు పుట్టి రూ.17,500కు కొంటున్నారు. అది కూడా తరుగు, తేమ శాతం, కొలతల్లో తేడాలు, తదితర అంశాల్లో రైతులను మోసం చేస్తున్నారు. కానీ ప్రభుత్వ మద్దతు ధర రూ.19,725 ఉంది. అంటే ఒక పుట్టికి(850కేజీలు) రూ.2వేలకు పైగా రైతులు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరగలేక ..



అనంతసాగరం మండలంలో దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో 56 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఉపయోగపడడం లేదనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో వరి కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకే గోనె సంచులు, లారీలు, ఆన్‌లైన్ ప్రాసెస్‌కు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు తేమ శాతం పేరుతో కొనుగోలు కేంద్రం సిబ్బంది రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ఆరుగురు రైతులు 1528 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే విక్రయించినట్లు సిబ్బంది తెలిపారు. అధిక శాతం మంది రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరగలేక, ధాన్యాన్ని ఆరబోయలేక పొలాల వద్దనే ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే పుట్టికి రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు తగ్గించి దళారులకు విక్రయిస్తున్నారు.

దళారీకే విక్రయించా



నేను 8 ఎకరాల్లో కేఎస్ఎం వరి సాగు చేశా. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని నిబంధనలు పాటించలేక దళారీకే విక్రయించా. ధాన్యం ఆరబోసి పాట్లు పడలేక దళారీకి నేరుగా విక్రయించాం. ధరలో కొంచెం తేడా ఉన్నా తప్పలేదు.

– నాగం సాంబశివారెడ్డి, దేవరాయపల్లి

రైతులు ఆసక్తి చూపడంలేదు



ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆసక్తి చూపడంలేదు. నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రానికి తీసుకెళితే ఏ గ్రేడ్ రకం ధాన్యం పుట్టికి రూ.19,550 చెల్లిస్తున్నారు. దళారీ కూడా అంతే ఇవ్వడంతో అతనికే విక్రయించా.

–ఎం చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందమ్మపల్లి

వ్యాపారులే మేలు



మా గ్రామంలో ఏ రైతు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించలేదు. గతేడాది ధరలు ఈ ఏడాది లేవు. ఖర్చులు మాత్రం పెరిగాయి. ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టక రైతులను ముంచింది. –పీ మధుసూదన్‌రెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు

గతేడాదే ధరలు బాగున్నాయి



ఈ ఏడాది కంటే గతేడాదే ధరలు బాగున్నాయి. గతేడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు మంచి గిట్టుబాటు ధరలు లభించాయి. ప్రస్తుతం ధాన్యం ధరలు తక్కువగా ఉన్నాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రి వేళ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. లారీలకు అధిక మొత్తంలో అద్దె అడుగుతున్నారు. బుధవారం రాత్రి 1250 బస్తాలను సంగం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా అప్పటికే మిల్లుకు సంబంధించి 2,400 బస్తాల పరిమితి దాటిపోయిందని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రాత్రంతా ధాన్యం లోడు లారీని కేంద్రం వద్దే పెట్టుకుని అక్కడే ఉండాల్సి వచ్చింది.

– ప్రభాకర్, రైతు, జంగాలకండ్రిక

నిబంధనలు ఎక్కువ



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నిబంధనలు అధికంగా ఉండడంతో కొంచెం తక్కువ ధరైనా దళారులకే ధాన్యం విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పేరుతో కొర్రీలు వేస్తున్నారు. దీనికితోడు ధాన్యం లోడు దించేందుకు మిల్లర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇవి వేగలేక దళారులకే అమ్మేస్తున్నాం.

–పాలకొండ వెంకట రత్నారెడ్డి, బోడిపాడు, చేజర్ల

క్లుప్తంగా

వెంగమాంబ హుండీ రాబడి రూ.10.37 లక్షలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో హుండీ కానుకల లెక్కింపును గురువారం నిర్వహించారు. గతేడాది డిసెంబరు 9వ తేదీ నుంచి గురువారం వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.10,37,020 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు.

ముగిసిన అంగన్‌వాడీ శిక్షణ తరగతులు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న పోషణ్ బీ -పడాయి బీ శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. చేజర్ల ఐఈఆర్టీ షేక్ మస్తాన్‌వలీ 21 రకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. చివరిరోజు ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీలు శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను వంద శాతం అమలు చేయాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ సురేఖ, ఆర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు శిక్షణ

అల్లూరు: మండలంలోని ఇందుపూరులో నోకియా వారి సహకారంతో రీచా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాడి రైతులకు జీవనోపాధి-పాల ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై శిక్షణను గురువారం నిర్వహించారు. నార్తుమోపూరు పశువైద్యాధికారి గౌతమ్ పాల్గొని పశువుల షెడ్ల నిర్వహణ, మేలైన పశువుల జాతుల ఎంపిక, పోషణ, వ్యాధుల గుర్తింపు, నివారణ, పాల ఉత్పత్తి పెంపు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

యువకుడి అదృశ్యం



అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీదకొండూరు గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై ఏఎస్‌పేట పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన మాదాల మహేష్ రోజులాగే ఆదివారం రాత్రి తన ఇంట్లో నిద్రించాడు. సోమవారం ఉదయం చూడగా కనిపించలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఏఎస్‌పేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. యువకుడికి సుమారు 27 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎర్ర చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువకుడి వివరాలు తెలిసిన వారు 96764 12432 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

క్యాంపస్ ఎంపికలు



కావలి: స్థానిక డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ మదర్సన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ ఎంపికలను గురువారం నిర్వహించారు. ఈసీఈ విభాగానికి చెందిన 50 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలు హాజరవగా, 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ టీవీ రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేష్, ఏఓ రమేష్ బాబు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కావలి: పాలిసెట్-2025కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఏప్రిల్ 15వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలనికావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ ప్రియా గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, బీసీ, ఓసీలు రూ.400 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 30న పరీక్ష జరుగుతుందని తెలిపారు. కావలిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 99490 22772, 83280 95743 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థినికి అభినందన



ఆత్మకూరు: పట్టణంలోని ఏఎస్సార్ డిగ్రీ కళాశాలకు చెందిన బీసీఏ విద్యార్థిని ఏ కీర్తి క్యాంపస్ ఎంపికల్లో ప్రతిభకనబర్చి సీజీఐ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైందని ఆ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో కీర్తిని ఆయన అభినందించారు. తమ కళాశాలలో సీఆర్టీ అనే ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలకు శిక్షణను ఇస్తున్నామని ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ డీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కరిముల్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పరామర్శ

సీతారామపురం: మండలంలోని చిన్నాగంపల్లిలో గురువారం జరిగిన సర్పంచ్ మునగల రామచంద్రారెడ్డి తల్లి శంకరమ్మ ఉత్తరక్రియల్లో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. శంకరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పీసీ అల్లూరురాజు, గుండుపల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి, వంతుల సుధాకర్‌రెడ్డి, రేనాటి సుధాకర్ నాయుడు, గాజులపల్లి రామిరెడ్డి ఉన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు వాహన సౌకర్యం



ఆత్మకూరు: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని బాల భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాన్ని ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి గురువారం ప్రారంభించారు. బాలభవిత కేంద్రానికి ప్రత్యేకావసరాల పిల్లలను తీసుకురావడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాహన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ల్యాబ్‌టెక్నీషియన్ల కీలకం

ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ల డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి కేక్ కట్ చేసి ల్యాబ్‌టెక్నీషియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. రోగ నిర్ధారణలో ల్యాబ్‌టెక్నీషియన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు అపోలో ఆస్పత్రి డయాలసిస్ విభాగం మేనేజర్ డాక్టర్ సురేంద్ర కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

కలిగిరి: పెద్దకొండూరులో ప్రధాన రహదారి అనుకుని ఉన్న పాత ఎస్సీకాలనీ స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబుకు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 760-1లోని 3.54 ఎకరాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు స్థలం ఆక్రమణపై విచారణ జరుపుతున్నారు.

కొండబిట్రగుంట ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

కావలి: బోగోలు మండలం కొండబిట్రగుంటలో జరుగుతున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు కావలి డిపో మేనేజర్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఏటా గరుడ సేవా, తెప్పోత్సవం, కల్యాణోత్సవం జరిగే మూడు రోజులు భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని చెప్పారు. అదేవిధంగా ఈ ఏడాది బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భక్తులు ప్రత్యేక బస్సులకు సంబంధించి ఎలాంటి సమాచారం కోసమైన 99592 25643 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీజేపీ మండల కార్యవర్గ ఎన్నిక

ఉదయగిరి: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల బీజేపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షురాలు పాలగుల్ల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులుగా మూల మాధవరెడ్డి, దగ్గుపాటి శ్రీహరి, కార్యదర్శులుగా తోకా కుమారి, బసిరెడ్డి వైష్ణవి, సూర్య నారాయణ, ఉపాధ్యక్షులుగా డీ కేశవనారాయణ,భూపాలం కార్తీక్ కే సురేష్, కోశాధికారిగా బొంతల సుబ్బారావును ఎన్నుకున్నారు. సీనియర్ నేతలు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మర్రిపాడు: డీసీపల్లిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వలస కూలీల కుటుంబాలకు సీపీఎం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, మండల శాఖ కార్యదర్శి రంతుల్లా, ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ, సీపీఎం నాయకుడు సుధాకర్ నాయుడు కూలీలను పరామర్శించి రూ.5వేలు నగదు, పది చీరలను అందజేశారు. .

ఉచితంగా కిడ్నీ పరీక్షలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని మాసిలామణి చిన్నపిల్లల వైద్యశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉచితంగా కిడ్నీ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్ఓ మాసిలామణి కిడ్నీ వ్యాధులు..రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

కొండాపురం/చేజర్ల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను అందజేస్తోందని కొండాపురం, చేజర్ల ఎంపీడీఓలు ఆదినారాయణ, ఎస్ విజయలలిత గురువారం తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని చెప్పారు. 75 శాతానికిపైగా హాజరుతో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, కుట్టుమెషీన్లు సైతం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిని మహిళలు గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

సీతారామపురం: స్థానిక మద్యం దుకాణాలను ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ గురువారం తనిఖీ చేశారు. మద్యం స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అదనంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణలో సమయాన్ని పాటించాలన్నారు. మద్యం దుకాణం పక్కనే మద్యం సేవిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులపై పరిశీలన

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ వద్ద పీఎంజీఎస్‌వై పథకం కింద చేపడుతున్న రోడ్డు నిర్మాణంపై వచ్చిన అభ్యంతరాలపై తహసీల్దార్ సుధీర్, పీఆర్ పీఐయు విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి గురువారం క్షేత్ర పరిశీలన చేశారు. స్థానిక రైతులు బొగ్గేరు సమీపంలో ఆక్రమించుకున్న భూమికి సంబంధించి మండల సర్వేయర్ రాజేష్, తదితరుల ఆధ్వర్యంలో కొలతలు వేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న రోడ్డు ప్రజా ఉపయోగమైందని, ఇప్పటికే సాగులో ఉన్న రైతులు సహకరించాలని కోరారు. తాము సర్వే చేసి ఏర్పాటు చేసిన హద్దుల లోపల రోడ్డు నిర్మాణానికి చట్టపరంగా ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు.

తలసేమియాపై అవగాహన



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కావలి: పిల్లలలో వచ్చే ప్రాణాంతక వ్యాధి తలసేమియాపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యాధికారిణి రమ్య అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నెలల వ్యవధిలోనే తలసేమియా వ్యాధి బయటపడుతుందని తెలిపారు. రక్తలేమి, విపరీతమైన అలసట, వయస్సుకు తగ్గట్టు ఎదగకపోవడం తదితరాలు తలసేమియా లక్షణాలన్నారు. ఈ వ్యాధి కారణంగా పిల్లల ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారుతుందన్నారు. తరచూ రక్తమార్పిడి చేస్తే తప్ప పిల్లలు బతికే పరిస్థితి ఉండదన్నారు. వయస్సుకు తగ్గట్టు ఎదగకపోవడం కూడా తల్లిదండ్రులను మరింత కుంగుబాటును గురి చేస్తుందన్నారు. తలసేమియా లక్షణాలు ఉన్న పిల్లలను ఆస్పత్రికి తీసుకొస్తే వారికి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు మందులు, పౌష్టికాహారం, తరచూ వైద్యపరీక్షలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ కన్వీనర్ హరినారప రెడ్డి, డాక్టర్ మదన్, ఉపాధ్యాయులు చాముండేశ్వరి, కవిత, తదితరులు పాల్గొన్నారు.